# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 24 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## టీజీ సెట్ ప్రాథమిక కీపై అభ్యంతరాల స్వీకరణ

**TG SET 2024**

**బలగం టీవీ, హైదరాబాద్**

: రాష్ట్రవ్యాప్తంగా అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులకు అర్హత సాధించేందుకు నిర్వహించే టీజీ సెట్ 2024 పరీక్ష ప్రశ్నాపత్రం ప్రాథమిక కీని ఇప్పటికే విడుదల చేశామని, దీనిపై అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ గడ్డం నరేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.అభ్యర్థులు తమ వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్ నెంబర్, పుట్టిన తేదీ ఉపయోగించి, లాగిన్ అయి, అభ్యంతరాలు లేవనెత్తవచ్చని చెప్పారు. దానికి సంబంధించిన సాక్ష్యాలను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం నుంచి గురువారం వరకు ఈ అవకాశం అందుబాటులో ఉంటుందన్నారు. దీనిని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డు..!

- **వైద్యారోగ్య, పౌర సరఫరాల శాఖ మంత్రులు, అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష**



**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది. రేషన్, ఆరోగ్య, ఇతర సంక్షేమ పథకాలన్నింటికీ ఉపయోగపడేలా ఒకే కార్డు అందించాలని భావిస్తోంది. ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డులో ప్రతి కుటుంబ సభ్యుని హెల్త్ ప్రొఫైల్ పొందుపరచడమే కాకుండా దీర్ఘకాలంలో వైద్య సేవలకు ఉపయోగపడేలా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

డిజిటల్ హెల్త్ కార్డుల జారీ అంశంపై వైద్యారోగ్య, పౌర సరఫరాల శాఖ మంత్రులు, అధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. కుటుంబాల్లో కొత్త సభ్యులు చేరినప్పుడు లేదా తొలగించాల్సి వచ్చినప్పుడు కార్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకునేలా వ్యవస్థ ఉండాలని ఆదేశించడంతో పాటు పలు సూచనలు చేశారు.

కుటుంబాల సమగ్ర వివరాల నమోదుతో ఇప్పటికే రాజస్థాన్, హర్యానా, కర్ణాటక రాష్ట్రాలు కార్డులు ఇచ్చినందున వాటిపై అధ్యయనం చేసి నివేదిక రూపొందించాలి. తెలంగాణ వ్యాప్తంగా ప్రతి శాసనసభ నియోజకవర్గం పరిధిలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంపిక చేసుకొని పైలెట్ ప్రాజెక్టు కింద కార్యాచరణ ప్రారంభించాలి.అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ఉండాలని, ఈ కార్డులతో లబ్ధిదారులు ఎక్కడైనా రేషన్, ఆరోగ్య సేవలు పొందేలా ఉండాలి. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల వ్యవస్థ మానిటరింగ్ కోసం జిల్లాల వారీగా వ్యవస్థలను ఏర్పాటు చేయాలి.

**ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో ఆరోగ్య సేవలు**

ఫ్యామిలీ డిజిటల్ కార్డుతోనే కుటుంబ సభ్యులందరికీ ఆరోగ్య సేవలు అందాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ కార్డులోని ప్రతీ ఒక్కరి హెల్త్ పొఫైల్ ఉండాలన్నారు. అర్హులందరికీ ఫ్యామిలీ డిజిటల్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల మానిటరింగ్ కు జిల్లాల వారీగా ఒక వ్యవస్థ ఉండాలని సూచించారు. రాజస్థాన్, హర్యానా, కర్ణాటక లాంటి ఇతర రాష్ట్రాల్లో అమలులో ఉన్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచనలు చేశారు.

**ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ కార్డులు**

రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ కార్డుల ఇచ్చేందుకు ప్రభుత్వం రంగం సిద్ధమవుతోంది. 83 లక్షలకు పైగా కుటుంబాల ఆరోగ్య వివరాలను సేకరించనుంది. ఈ సమాచారాన్ని ప్రత్యేక యాప్ లో ఎంట్రీ చేయనున్నారు. త్వరలోనే డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులను జారీ చేయాలని సర్కారార్ భావిస్తోంది. ఈ స్కీమ్ ను త్వరలోనే పట్టాలెక్కించనుంది. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో వైద్య సిబ్బంది వివరాలను సేకరించనుంది. ఓ వ్యక్తికి సంబంధించిన పూర్తి ఆరోగ్య సమాచారం తెలుసుకునేలా ఈ కార్డులు ఉండనున్నాయి. ఈ నేపథ్యంలో సమాచార సేకరణ నుంచి కార్డుల జారీ వరకు అత్యంత పకడ్బందీగా వ్యవహరించాలని వైద్యారోగ్య శాఖ నిర్ణయించింది. ఇటీవలే డిజిటల్ హెల్త్ కార్డులపై మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఇందులో కీలక ఆదేశాలను ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు.

### 15 టాప్ టెక్ సీఈవోలతో
# ప్రధాని మోడీ రౌండ్ టేబుల్ సమావేశం



**బలగం టీవీ, వాషింగ్టన్**

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అమెరికా పర్యటన కొనసాగుతోంది. మూడు రోజుల పర్యటన నిమిత్తం అమెరికా వెళ్లిన ప్రధాని.. క్వాడ్ దేశాల సదస్సులో పాల్గొన్నారు. ఆ తర్వాత న్యూయార్క్‌లో జరిగిన ప్రవాస భారతీయులతో ప్రత్యేక కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. తాజాగా టెక్ కంపెనీల సీఈవోలతో ప్రధాని రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్.. న్యూయార్క్‌లోని ఓ హెూటల్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించింది. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, అడోబ్ సీఈవో శంతను నారాయణ్, ఎన్విడియా సీఈవో జెన్‌సెన్ హాంగ్ సహా 15 టాప్ టెక్ సీఈవోలు ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోను మోదీ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. సీఈవోలతో ఫలప్రదమైన చర్చలు జరిగాయని, టెక్నాలజీ, ఇన్నోవేషన్ తదితర అంశాల గురించి చర్చించినట్లు తెలిపారు. సాంకేతికత, ఆవిష్కరణలు సహా పలు అంశాలపై చర్చలు జరిపామన్నారు. ఆయా రంగాల్లో భారత్ సాధించిన ప్రగతి గురించి మాట్లాడినట్లు చెప్పారు. మేడ్ బై ఇండియా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు వెల్లడించారు.

# సబ్యసాచి ఘోష్‌కు స్పెషల్ సీఎస్‌గా పదోన్నతి..

- **ఉత్తర్వులు జారీ**

**బలగం టీవీ, హైదరాబాద్**

పశుసంవర్ధక, డైరీ అభివృద్ధి, మత్స్యశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న సబ్యసాచిఘోష్ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హెూదాలో పదోన్నతిని పొందారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం నిర్వహిస్తున్న విధుల్లోనే కొనసాగిస్తూ రీ డిజిగ్నేట్ చేస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆయన తన ప్రారంభ ఉద్యోగ జీవితం వరంగల్, విజయనగరం, పశ్చిమగోదావరి, కరీంనగర్ జిల్లాలలో కొనసాగించారు. 2002 జాతీయ క్రీడల వేడుకలకు ప్రత్యేక అధికారిగా పనిచేశారు. 2003లో మొదటి ఆఫ్రో ఆసియా క్రీడలకు ప్రత్యేక అధికారిగా, భారీ, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను (గచ్చిబౌలి, స్పోర్ట్స్ కాంప్లెక్స్, 7 స్టేడియంలు) విజయవంతంగా నిర్వహించారు.2004 -2011 మధ్య కాలంలో పర్యాటక, ఆర్థిక, క్రీడల శాఖలో సేవలందించారు. హైదరాబాదులో ఏసియన్ డెవలప్‌మెంట్ ఏజీఎంగా 2005లో మిలిటరీ వరల్డ్ గేమ్స్ కు ముఖ్యకార్యక్రమాల నిర్వహణ బాధ్యతలు నిర్వహించారు. మిలిటరీ వరల్డ్ గేమ్స్ విలేజ్ అభివృద్ధికి ఆయన సముచితంగా సేవలందించారు.

2011-2016 మధ్యకాలంలో, పరిశ్రమలు, వాణిజ్యశాఖలో బాధ్యతలు నిర్వర్తించారు (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ) ఈ సమయంలో పరిశ్రమల ప్రోత్సాహకంతో పాటు, మైనింగ్, ఎంఎస్ఎంఈ, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్, పరిశ్రమల మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆహార ప్రాసెసింగ్, చర్మ, ఖాధీ, గ్రామీణ పరిశ్రమలు వంటి ముఖ్యమైన అంశాలలో విశిష్ట సేవలందించారు. 2015-2016లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్స్‌కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవలందించారు. 2017 -2024 మధ్య, యువజన సర్వీసుల శాఖకు కార్యదర్శి, ముఖ్య కార్యదర్శిగా సేవలందించారు. తెలంగాణ సొసైటీ ఫర్ ట్రేనింగ్, ఎంప్లాయిమెంట్, ప్రమోషన్ (స్టెప్,సెట్విన్) సంస్థలకు ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, ఉద్యోగ ప్రమోషన్ కార్యక్రమాలలో విశిష్ట సేవలు అందించారు.

# మంత్రులతో ముఖాముఖీ..

- **కొత్త కార్యక్రమానికి శ్రీకారం !**

**బలగం టీవీ, హైదరాబాద్**

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు పార్టీ, గాంధీభవన్, కార్యకర్తలు లేకుండా ప్రభుత్వమే లేదని, కార్యకర్తలకు మంత్రులు అందుబాటులో ఉండాలని చేసిన సూచనల మేరకు బుధవారం నుంచి మంత్రులు గాంధీభవన్‌లో కార్యకర్తలకు అందుబాటులో ఉండబోతున్నారు. ఈ మేరకు షెడ్యూల్‌ను ఖరారు చేశారు.

ప్రతి బుధ, శుక్రవారాలు మంత్రులు గాంధీభవన్‌కు రానున్నారు. పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ప్రతి వారం ఇద్దరు మంత్రులు, నెలకోసారి ముఖ్యమంత్రి గాంధీభవన్‌కు వచ్చి ప్రజలు, పార్టీ కార్యకర్తల కష్టసుఖాలు తెలుసుకునేందుకు షెడ్యూల్ ఖరారు చేయాలని మహేష్‌కుమార్ గౌడ్ చేసిన సూచనలను సీఎం రేవంత్ రెడ్డి అంగీకరించిన విషయం తెలిసిందే. గత శుక్రవారం నుంచే ఈ ముఖాముఖి కార్యక్రమం ప్రారంభం కావాల్సి ఉండగా మంత్రి వర్గ సమావేశం ఉన్నందున వాయిదా పడింది. వాయిదా పడిన ఈ కార్యక్రమం ఈ బుధవారం నుంచే మొదలుకానుంది. ఈ నెలతో పాటు అక్టోబర్ నెలలో మంత్రుల ముఖాముఖి షెడ్యూల్ కూడా ఖరారైంది.

ఈ నెల 25న బుధవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ రానున్నారు. 27న డి శ్రీధర్ బాబు, అక్టోబర్ 4న ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, 9న పొన్నం ప్రభాకర్, 11న డి అనసూయ సీతక్క, 16న కోమటిరెడ్డి వెంకటరెడ్డి, 18న కొండా సురేఖ, 23న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, 25న జూపల్లి కృష్ణారావు, 30న తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం నీటి పారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి కార్యకర్తలతో మమేకం అవుతారు.

ఈ మేరకు మంత్రుల షెడ్యూల్ ఖరారైంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మంత్రులు అందుబాటులో ఉంటారు. పార్టీ పరంగా సమస్యలను వింటారు. ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఇందు కోసం ఇందిరాభవన్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యకర్తలు కూర్చునేందుకు వీలుగా తాత్కాలికంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం..



- **మహారాష్ట్రలో లోయలో పడిన బస్సు..**
- **నలుగురు మృతి**
- **44 మందికి గాయాలు**

**బలగం టీవీ, ముంబై**

మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అమరావతికి సమీపంలోని మేలేఘాట్ వద్ద ప్రయాణికులతో వెళ్తున్న బస్సు లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయాల పాలయ్యారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ప్రయాణికులతో అమరావతి నుంచి ధరణి వైపు వెళ్తోంది. ఉదయం 8:30 గంటల ప్రాంతంలో సేమడోహ్ సమీపంలోని భూత్‌ఖోరా ప్రాంతంలో ప్రమాదకరమైన వంపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో బస్సు అదుపుతప్పి వంతెనపై నుంచి లోయలోకి పడిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.వారిలో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. 44 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులను హుటాహుటిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

# పండు ముసలవ్వలను రోడ్డు మీదకు తీసుకొచ్చారు



- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి.. ఏ ఒక్క గ్యారెంటీ అమలు చేయకుండా అన్ని వర్గాలను ప్రజలను మోసం చేశారు. వృద్ధులకు ఇచ్చే పెన్షన్లు పెంచుతానని మాయమాటలు చెప్పి.. చివరకు పండు ముసలవ్వలను కూడా మోసం చేసిన నీచుడు రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఆసరా పెన్షన్లు సకాలంలో రాక.. వృద్ధులు కూడా రోడ్లెక్కి ధర్నా చేయాల్సిన పరిస్థితి ఈ రాష్ట్రంలో దాపురించిందన్నారు. కల్లబొల్లి మాటలు జెప్పి పెద్దమనుషులను కూడా కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆసరా పెన్షన్లతో అవ్వ–తాతలకు కేసీఆర్ సర్కార్ భరోసా నింపిందని గుర్తు చేశారు. ఆసరా పెన్షన్ల కారణంగా కొడుకు, కోడలు కూడా వృద్ధులను గౌరవంగా చూసుకునే వాతావరణం బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. బొడ్లే సంచి బరువు పెంచి అమ్మమ్మ–నాయనమ్మల గౌరవాన్ని కేసీఆర్ పెంచారని తెలిపారు.

కానీ నెలకు రూ. 4 వేల పెన్షన్ ఇస్తా అని జూటా మాటలు చెప్పి.. మేమిచ్చిన పింఛన్ కూడా సరిగా ఇవ్వని రేవంత్ సర్కార్ ఇవాళ పండు ముసలవ్వలను సైతం రోడ్డెక్కి ధర్నా చేసే పరిస్థితి కల్పించారని కేటీఆర్ ఆగ్రహం వెలిబుచ్చారు. మొన్న గద్వాలలో అవ్వా–తాతలు రోడ్ల మీద ధర్నా.. ఇవాళ మానకొండూర్ పోలీస్ స్టేషన్‌లో వృద్ధ దంపతుల ధర్నాలు నిత్యకృత్యమయ్యాయని కేటీఆర్ తెలిపారు. పెన్షన్ల కోసం అవ్వలు రోడ్డెక్కి ధర్నా చేస్తే సిగ్గు అనిపించడం లేదా రేవంత్ అని ప్రశ్నించారు. తక్షణం మీ జూటా హామీని అమలు చేసి అవ్వలకు 4 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు

## భారత్‌లో తొలి క్లేడ్ 1 మంకీపాక్స్ కేసు నమోదు




**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్‌లో ప్రాణాంతక క్లేడ్ 1 బీ రకం మంకీపాక్స్ తొలికేసు నమోదైంది. ప్రపంచ ఆరోగ్య అత్యయిక స్థితికి దారి తీసిన క్లేడ్ 1 బీ రకంగా దీన్ని గుర్తిం చారు. కేరళ లోని మలప్పురానికి చెందిన 38 ఏళ్ల వ్యక్తిలో ఈ వ్యాధి నిర్ధారణ అయినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. యూఏఈ నుంచి ఇటీవలనే ఆయన కేరళకు వచ్చాడు. అతడిలో ఎంపాక్స్ లక్షణాలు కనిపించడంతో వైద్య పరీక్షలు చేయగా క్లేడ్1 గా నిర్ధారణ అయ్యింది. దీంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంపాక్స్‌ను ప్రజా ఆరోగ్య అత్యయిక స్థితిగా గత నెల రెండోసారి ప్రకటించడానికి దారి తీసింది. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఎంపాక్స్ మొదటి కేసు ఢిల్లీలో బయటపడింది.

# మాదాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు



**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ మాదాపూర్‌లోని కావూరి హిల్స్‌లో అక్రమనిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. కావూరి హిల్స్ పార్కులోని అక్రమ షెడ్లను కూల్చేసింది. అయితే గడువు తీరకముందే స్పోర్ట్స్ అకాడమీని అన్యాయంగా కూల్చేశారని నిర్వాహకులు ఆరోపించారు.

పార్కు స్థలంలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేశారు. ఈ స్పోర్ట్స్ అకాడమీపై కావూరి హిల్స్ అసోసియేషన్ హైడ్రాకు ఫిర్యాదు చేసింది. కావూరి హిల్స్ అసోసియేషన్ ఫిర్యాదుతో అక్రమ షెడ్లను కూల్చేశారు. ఈ అక్రమ నిర్మాణాలను తొలగించి కావూరిహిల్స్ పార్కు పేరిట బోర్డును ఏర్పాటు చేశారు. పార్కు స్థలాన్ని 25 ఏళ్ల లీజుకు తీసుకున్నామని స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు తెలిపారు. గడువు తీరక ముందే అన్యాయంగా నిర్మాణాలు తొలగించారని ఆరోపించారు.

**హైకోర్టు ఆదేశాల మేరకు ఆక్రమణలు కూల్చివేశాం**

హైకోర్టు ఆదేశాల మేరకు కావూరిహిల్స్‌లో పార్కు ప్రదేశాన్ని ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ మేరకు కావూరి హిల్స్ పార్క్ కూల్చివేతలకు సంబంధించి ఆయన వివరణ ఇచ్చారు. కావూరిహిల్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈ విషయంలో హైకోర్టును ఆశ్రయించిందని, పార్క్ లేఔట్ స్థలంలో ఆక్రమణలు తొలిగించాలని హైకోర్టు ఆదేశించినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం అభ్యర్థన మేరకు హైడ్రా కావూరి హిల్స్ పార్క్‌లోని 3 షెడ్లు, టెన్నిస్ కోర్టును కూల్చివేసినట్లు రంగనాథ్ తెలిపారు. 2 వేల చదరపు గజాల స్థలాన్ని స్వాధీనం చేసుకొని పార్క్ అభివృద్ధి కోసం జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులకు అప్పగించినట్లు రంగనాథ్ స్పష్టం చేశారు.

# సీఎం సహాయ నిధికి విరాళం అందజేసిన మహేశ్ బాబు



- **రూ.50 లక్షల చెక్కు అందజేత**
- **ఏఎంబీ తరపున మరో రూ. 10 లక్షలు**

**బలగం టీవీ, హైదరాబాద్**

వరద బాధితుల సహాయార్థం పలువురు ప్రముఖులు తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు అందజేస్తున్నారు. తాజాగా టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు కూడా సీఎం సహాయ నిధికి విరాళం అందించారు.మహేశ్ బాబు సోమవారం ఉదయం తన సతీమణి నమ్రతతో కలిసి జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ సీఎంను కలిసి వరద బాధితుల సహాయార్థం విరాళం అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50 లక్షల చెక్కును అందజేశారు. ఏఎంబీ తరపున మరో రూ.10లక్షలు విరాళంగా ఇచ్చారు. ఇదిలా ఉండగా చాలా రోజుల తర్వాత మహేశ్‌బాబు బయటకు రావడంతో ఆయన లుక్ ఆకట్టుకుంది. . మహేష్ లాంగ్ హెయిర్, గుబురు గడ్డం చూస్తుంటే హాలీవుడ్ హీరోను తలపించేలా కనిపిస్తున్నాడని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.





## తిరుమల లడ్డు వివాదంపై సుప్రీం కోర్టులో రెండు పిటిషన్లు

**బలగం టీవీ, హైదరాబాద్**

తిరుపతి లడ్డులో జంతువుల కొవ్వు కలిపారన్న చంద్రబాబు నాయుడు ఆరోపించిన సంగతి తెలిసిందే. అలాగే దీనిపై సిట్ సమగ్ర విచారణ జరుపనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆ తర్వాత వివాదం సుప్రీంకోర్టుకు చేరుకుంది. సుప్రీంకోర్టులో తాజాగా రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. ఒకటి బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి వేయగా, మరోటి వైసీపీ నేత వైవి. సుబ్బా రెడ్డి వేశారు.

తిరుమల లడ్డుపై సీఎం చంద్రబాబు నాయుడు చేసిన వివాదస్పద వ్యాఖ్యలపై విచారణ చేపట్టాలని సుబ్రహ్మణ్యస్వామి కోరుతూ పిల్ వేశారు. వైవి. సుబ్బారెడ్డి కూడా విచారణ కోరతూ పిటిషన్ దాఖలు చేశారు. కాగా హైకోర్టు కూడా వైవి.సుబ్బారెడ్డి పిటిషన్ పై విచారణ చేపట్టింది. ఇదిలా వుండగా సుబ్రహ్మణ్య స్వామి, వైవి.సుబ్బారెడ్డి పిటిషన్లపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఎలాంటి విచారణ చేపడుతుందో వేచి చూడాల్సిందే.

## దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌ను 6 వారాల్లో నిర్ధారించాలి : హైకోర్టు

**బలగం టీవీ, హైదరాబాద్**

దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌పై బాధితులు తెలిపిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని ఆరు వారాల్లో ఎఫ్‌టీఎల్ నిర్ధారించాలని జీహెచ్‌ఎంసీకి హైకోర్టు స్పష్టం చేసింది. ఈ క్రమంలో ఆరు వారాల్లోపు కూల్చివేతలు చేపట్టబోమని జీహెచ్‌ఎంసీ తెలిపింది. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌పై సోమవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ శాస్త్రీయంగా జరగలేదంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లను సీజే ధర్మాసనం విచారించింది. ఈ క్రమంలో ఎఫ్‌టీఎల్‌పై అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. బాధితులు చెరువుల పరిరక్షణ కమిటీకి అభ్యంతరాలు తెలపాలని హైకోర్టు తెలిపింది. వారంలోపు బాధితులు అభ్యంతరాలు తెలపాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది.అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని 6 వారాల్లో ఎఫ్‌టీఎల్ నిర్ధారించాలని హైకోర్టు స్పష్టం చేసింది. 6 వారాల్లోపు కూల్చివేతలు చేపట్టబోమని కోర్టుకు జీహెచ్?ఎంసీ తెలిపింది. రికార్డుల ప్రకారం దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ 65 ఎకరాలే ఉందని పిటిషనర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ 160 ఎకరాలు ఉందని అధికారులు చెప్పడం సరికాదని పిటిషనర్లు వాదించారు.

# ఉద్యమకారులకు ప్రజా ప్రభుత్వంలో పెద్దపీట..





- గత ప్రభుత్వం వేములవాడ అభివృద్ధిని ఏనాడు పట్టించుకోలేదు..
- గల్ఫ్ కార్మికులకు అండగా ప్రజా ప్రభుత్వం...
- ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**బలగం టీవీ , వేములవాడ :**

గత ప్రభుత్వ హయాంలో వేములవాడ వెనుకబడిపోయింది,గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి కనీసం భూసేకరణ కూడా జరపలేదని, రంగురంగుల బ్రోచర్లతో ప్రజలను మభ్యపెట్టిర్రని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.సోమవారం వేములవాడ పట్టణంలో మడేలేశ్వర అలయ సమీపంలో రజాక సహకార సంఘం నూతన సంఘా భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై భూమి పూజ నిర్వహించారు.ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ

గత ఎన్నికల సమయంలో నామినేషన్ దాఖలు వేసే ముందు మడేలేశ్వర స్వామి వారి ఆశీసులు తీసుకున్నా, మొదట ప్రాధాన్యత క్రమంలో పట్టణ పరిధిలోని 32 సంఘాలకు నిధులు మంజూరు చేశానని అన్నారు. సామాజిక భవనలు సమస్యల పరిష్కారానికి వేదికలుగా ఉపయోగపడతాయని, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన 10 కోట్ల నిధులను నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాల్లో అత్యవసరంగా ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించటం జరిగింది అని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి రవీంద్ర భారతిలో చాకలి ఐలమ్మ వర్ధంతి ఘనంగా నిర్వహించారని.. కోఠిలోని ఉమెన్స్ కాలేజీ కి చాకలి ఐలమ్మ పేరు పెట్టారు అని అన్నారు.

**ప్రజా ప్రభుత్వంలో ఉద్యమకారులకు దక్కిన గౌరవం**

గత ప్రభుత్వం ఉద్యమ కారులను, అమరుల కుటుం బాలకు మొండి చెయ్యి చూపిందన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ ఏనాడు కూడా మహాత్మ జ్యోతిరావు బాపులే వర్ధంతికి జయంతికి కనీసం పూలమాల వేయలేదు,ప్రజా ప్రభుత్వంలో మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ముం దుకు పోతున్నామని,ఉద్యమకారులకు పెద్ద పీట వేస్తు న్నామని అన్నారు.రాహుల్ గాంధీ పాదయాత్ర సమయంలో దేశవ్యాప్తంగా జనాభా, కులగనన జరగాల్సిందేనని అన్నారు అని,దానికి అనుగుణంగా కదా అసెంబ్లీ సమావేశాలలో బీసీ కులగలన బిల్లును ప్రవేశపెట్టామని అన్నారు.

ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదు అని,ప్రతినిత్యం ప్రజల మధ్యలో ఉంటూ, ప్రజలు అధికారులు చెప్పేది వింటు, ప్రతి సమస్య పరిష్కారానికి ఒక పాలసీ తీసుకొస్తున్నారు అని అన్నారు.

ప్రజా ప్రభుత్వంలో ఆడ తల్లులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ 10 లక్షల పెంపు, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్,రైతు రుణమాఫి చేశామని,ఇచ్చిన మాట కు కట్టుబడి ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుంది అని అన్నారు.

**గల్ఫ్ కార్మికులకు అండగా ప్రజా ప్రభుత్వం...**

గల్ఫ్ కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం వారికి అండగా ఉన్నామని,గతంలో టెంపుల్ ఛైర్మన్ గా ఉన్నా సమయంలో గల్ఫ్ లో మరణించిన వారి కుటుంబాలకు 1 లక్ష పరిహారం రాజశేఖర్ రెడ్డి ఇచ్చారన్నారు. గల్ఫ్ లో మరణించిన వారి కుటుంబాలకు కేసీఆర్ 5 లక్షల ఇస్తానని మోసం చేశారు అని అన్నారు.గత తొమ్మిది సంవత్సరాల లో శంషాబాద్ ఎయిర్పోర్టు లెక్కల ప్రకారం సుమారు రెండు వేలకు పైగా పార్థివ దేహాలు వచ్చాయని,గత ప్రభుత్వం వారికి కనీసం నష్టపరిహారం కూడా ఇవ్వలేదు అని అన్నారు.

తెలంగాణ చరిత్రలోనే ప్రజా ప్రభుత్వంలో వేములవాడ నియోజకవర్గంలో రెండు గల్ఫ్ బాధితులకు చెక్కుల పంపిణీ చేశామని,గల్ఫ్ కార్మికులకు కోసం సెప్టెంబర్ 17 న జివో తీసుకువచ్చామని,గల్ఫ్ లో మరణించిన వారికి 5లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వడం జరుగుతుంది అని అన్నారు.గల్ఫ్ కుటుంబ సభ్యులకు గురుకులాల్లో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది అని గల్ఫ్ సమస్యలపై ప్రత్యేక సలహా మండలి ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని అన్నారు.

**ఇచ్చిన మాటకు కట్టబడి ప్రభుత్వం ముందుకు పోతుంది..**

కొందరు ప్రభుత్వం వచ్చిన నాటి నుండి ప్రభుత్వం కూలిపోతుందని శాపానర్థాలు పెడుతూనే ఉన్నారు అని,9 మాసాలలో కాంగ్రెస్ పార్టీ సమన్వయంతో ముందుకు పోవడం పట్ల బీజేపీ బీఆర్ఎస్ వారికి ఏం చేయాలో అర్థం కావడం లేదు అని,ప్రజా ప్రభుత్వాన్ని ఓర్వలికే విమర్శలు చేస్తున్నారు అని అన్నారు.తెలంగాణ వచ్చిన రోజు తెలంగాణ రాష్ట్రం ధనిక రాష్ట్రంగా ఉండేది, కానీ గత ప్రభుత్వంలో ఏడు లక్షల కోట్ల అప్పు చేశారు అని,ప్రతినెల 6000 కోట్ల మిత్తి కడుతున్నామని అన్నారు.

గత ప్రభుత్వం రోడ్డు వెడల్పు, రాజన్న దేవాలయ అభివృద్ధి,కలికోట సూరమ్మ చెరువు, ముంపు గ్రామాల సమస్యలను ఏనాడు పట్టించుకోలేదు అని అన్నారు. మీ సేవకుడిగా ఉంటూ ప్రాధాన్యత క్రమంలో వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తా అని అన్నారు.




## కష్టపడ్డ కార్యకర్తలకు ఏదీ ప్రాధాన్యత..

- ఏండ్లు తరబడి పార్టీని నమ్ముకున్నాం...
- కొత్త వారికి మార్కెట్ కమిటీలో ఎట్లా తీసుకుండ్రు..

**బలగం టీవీ , సిరిసిల్ల :**

ఏండ్ల తరబడి కాంగ్రెస్ పార్టీ ని నమ్ముకుని ఉన్నామని, కష్టపడ్డ కార్యకర్తలకు మార్కెట్ కమిటీ లో ప్రాధాన్యత లేదు అని కాంగ్రెస్ సీనియర్ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలో ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 20 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్నామని, గతంలో ఉన్న ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టిన, కోర్టులు చుట్టూ తిరుగుతూ పార్టీ కోసం పనిచేశామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అందరికీ మంచి జరుగుతుందని, అందరికీ న్యాయం జరుగుతుందని, గత ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా కార్యకర్తలకు అండగా ఉంటూ, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అందరికీ మంచి జరుగుతుందని ఆశపడ్డాము కానీ, ఆశ వమ్ము అయిందని, పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను కనీసం గుర్తించడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం వరకు బీ ఆర్ఎస్, బిజెపి నుండి వచ్చిన వారికి మార్కెట్ కమిటీలు చోటు కల్పించారని అన్నారు. సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి కొత్తగా పార్టీలోకి వచ్చిన వారి ప్రలోభాలకు లొంగి మార్కెట్ కమిటీ లో చోటు కల్పించారని ఆరోపించారు.అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ కోసం కష్టపడ్డ వారిని కాదని, కొత్తగా వచ్చిన వారికి పదవులు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని, అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లి ఈ మార్కెట్ కమిటీలను రద్దుచేసి, కార్యకర్తల అభిప్రాయాలను తీసుకొని కష్టపడ్డ కార్యకర్తలకు అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తలు జిల్లా కార్యదర్శి నిమ్మల తిరుపతి గౌడ్,నాయకులు ఓరుగంటి నర్సింహులు, చత్ర బోయిన బాలయ్య, చికోటి నర్సయ్య,మిద్దె సత్యం, ఎడబోయిన రాజు, పిట్ల నర్సింలు,బత్తినినర్సింహులు, ధ్యాన బోయిన బాలకిషన్, పెద్ది గారి శ్రీనివాస్, పెరుమళ్ళ రాజశేఖర్, ఒడిసెల బాలయ్య, లచ్చ గారి నరేష్, బొల్లి మల్లయ్య, ఎర్ర వేణుగోపాల్,ఎర్ర సంతోష్, బుల్లి రాజు,అస్లాం,నుస్రాత్, మల్యాల రాజు వీర్, మాజీ ఎంపిటిసి పర్శరాములు,పిట్ల వెంకటి,మూల రామచంద్ర రెడ్డి,ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## జానీ మాస్టర్ కస్టడీకి నార్సింగి పోలీసుల పిటిషన్..

**రేపటికి వాయిదా వేసిన రంగారెడ్డి కోర్టు**

**బలగం టీవీ , హైదరాబాద్**

లైంగిక వేధింపుల ఆరోపణల్లో అరెస్టయిన కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌ను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ నార్సింగి పోలీసులు రంగారెడ్డి కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై కోర్టు విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఐదురోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో పోలీసులు కోరారు. మరో వైపు జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. జానీ పిటిషన్‌పై విచారణను కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. ప్రస్తుతం జానీ మాస్టర్ చర్లపల్లి జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ కేసులో జానీని కస్టడీకి ఇస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. జానీ మాస్టర్‌కు ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్‌ని విధించిన సంగతి తెలిసిందే.

## ఆది శ్రీనివాస్‌ను కలసిన గల్ఫ్ బాధితుడు ఇమ్రాన్..



**బలగం టీవీ , సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణానికి చెందిన ఇమ్రాన్ రెండు నెలల క్రితం సూపర్ మార్కెట్లో పనిపై సౌదీ అరేబియా దేశం వెళ్లి, సౌదీ అరేబియాలో ఫైల్స్ ఆపరేషన్ చేయించుకోగా ఆపరేషన్ చేసుకున్న ఆరోగ్యం కుదుట పడకపోవడంతో ఇండియా పంపాలని యాజమాన్యాన్ని కోరగా, వారు ఇండియాకు పంపక పోగా ఇమ్రాన్ ను కొడుతున్నారని, చంపేస్తామని బెదిరిస్తున్నారని స్వదేశానికి రప్పించాలని సోషల్ మీడియా వేదికగా వేడుకున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి రావడంతో తక్షణమే స్పందించిన ప్రభుత్వ విప్ ..ఇమ్రాన్ ను తిరిగి స్వదేశానికి రప్పించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇండియన్ ఎంబసీ, సౌదీ అరేబియా దేశానికి లేఖ రాసి అధికారులతో మాట్లాడారు. ఇమ్రాన్ స్వదేశానికి వచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు,ఇచ్చిన హామీ మేరకు అన్ని ఏర్పాట్లు చేయగా గురువారం సౌదీ అరేబియా నుండి సిరిసిల్లకు సురక్షితంగా చేరుకున్నాడు.సోమవారం ఇమ్రాన్ తన కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ పట్టణంలో ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ని కలిసి, పత్యేక ధన్యవాదాలు తెలిపారు

# రేషన్ డీలర్ల నియామకాలను ఓ కాంగ్రెస్ కార్యకర్త శాసిస్తుండు..

- ఇది ప్రజా పాలన కాదు... వసుళ్ళ పాలన..
- రేషన్ డీలర్ల నోటిఫికేషన్ రద్దు చేసి,కొత్త నోటిఫికేషన్ ఇవ్వండి..
- అభ్యర్థులు



**బలగం టీవీ, సిరిసిల్ల :**

రేషన్ డీలర్ల నియామకాల్లో ఓ కాంగ్రెస్ నాయకుడు జిల్లాని శాసిస్తుండు అని, డబ్బు ఉన్న వారికి, వారికీ నచ్చిన వారికి రేషన్ డీలర్ షిప్ ఇప్పిస్తున్నాడని, ఆ నోటిఫికేషన్ రద్దుచేసి, కొత్త నోటిఫికేషన్ వేయాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రజల బాగు కోసం రేషన్ డీలర్ల నియామకం చేపడితే అందరం సంతోషపడ్డామని,కానీ దీని వెనుక పెద్ద రాజకీయం నడుస్తుంది అని అన్నారు. ఎగ్జామ్ రాసిన తర్వాత, మర్క్స్ ఇవ్వకుండా ఊరికి ఇద్దరి ముగ్గురి మాత్రమే ఇంటర్వ్యూకు పిలిచారని, వారినే ఇంటర్వ్యూకి పిలిచేసరికి డబ్బులు తీసుకొని వారికే రేషన్ డీలర్ షిప్ కేటాయించే అనుమానాలు మాకు వస్తున్నాయని ఆరోపించారు. వెంటనే కలెక్టర్ జోక్యం చేసుకొని రేషన్ షాప్ డీలర్షిప్ ఎగ్జామ్ రాసిన వారందరినీ ఇంటర్వ్యూకి పిలిచి వారి స్థితి, ఆర్థిక స్థితి గమనించి వారికి డీలర్షిప్ కేటాయించాలని డిమాండ్ చేశారు.ఇక్కడ ఉన్న ఒక నాయకుడు, తను ప్రజలు ఎన్నుకున్న నాయకుడు కాదు కానీ, ఓ సామాన్య కార్యకర్త కేకే మహేందర్ రెడ్డి రేషన్ డీలర్షిప్ నియామకాల్లో తను చెప్పినట్టు వినాలని జిల్లా నే శాసిస్తున్నాడని అన్నారు.ఇది ప్రజా పాలనా అని అనుకుంటే, ఇది ప్రజా పాలన కాదు వసుళ్ళ పాలన అని అర్థమవుతుందని అన్నారు. రేషన్ డీలర్ షిప్ కోసం ఓ కాంగ్రెస్ కార్యకర్త కే కే మహేందర్ రెడ్డి కి ఫోన్ చేస్తే నా ఇష్టం ఉన్నవారికి ఇప్పించుకుంటానని చెప్పాడని, ఆ రికార్డు బహిర్గతమైందని అన్నారు. జిల్లాలో నేను చెప్పినట్టే నడుస్తుంది అని అనుకుంటున్నారు, ప్రశ్నిస్తే కేసులు పెడతా అని అనుకుంటున్నారేమో అది మంచి పద్ధతి కాదు అని అన్నారు. రేషన్ డీలర్ షిప్ నియమకాల కోసం వసూలు చేసి,అన్ని ఉన్నవారికి ఇస్తే సహించేది లేదు అని అన్నారు. వెంటనే ఈ రేషన్ డీలర్ల నియామకం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి మంచి వ్యక్తిగా నిలబడాలని, లేదు డబ్బు ఉన్న వాళ్లకే దాసోహం అంటూ ఉంటే ఊరుకునే ప్రసక్తే లేదు అని అన్నారు. వెంటనే రేషన్ డీలర్ షిప్ నియమాకాలు రద్దు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.



## 'దేవర' టికెట్ల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్..

- అర్ధరాత్రి ఒంటి గంట ఆటకు కూడా..
- ఈ నెల 27న విడుదల కానున్న చిత్రం

**బలగం టీవీ , హైదరాబాద్**

యంగ్ టైగర్ ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం దేవర. ఈ నెల 27న పాన్ ఇండియా స్థాయిలో ఈ మూవీ విడుదల కానుండగా.. ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ మూవీ టికెట్స్‌ను పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అలాగే, ఈ నెల 26న అర్ధరాత్రి ఒంటిగంట షోలకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 29 థియేటర్లలో అర్ధరాత్రి ఒంటిగంట షోకు అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఒంటిగంట షోలకు రూ.100 టికెట్ ధర పెంచుకునేందుకు వీలు కల్పించింది. తొలిరోజు ఉదయం 4 గంటల నుంచి షోలు వేసుకునేందుకు అంగీకరించింది. మూవీ విడుదల రోజు రాష్ట్రంలోని అన్ని థియేటర్లలో రూ.100 పెంచుకునే ఛాన్స్ కల్పించింది. ఈ నెల 28 నుంచి అక్టోబర్ 6 వరకు తొమ్మిది రోజుల పాటు టికెట్ల ధరలను పెంచుకోవచ్చని చెప్పింది.సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.25, మల్టీప్లెక్స్‌లలో రూ.50 పెంచుకునేందుకు అవకాశం కల్పించింది. జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న ఈ చిత్రం రెండుపార్టులుగా తెరకెక్కనున్నది. తొలి పార్ట్ ఈ నెల 27న విడుదలవుతున్నది. ఎన్టీఆర్ ఈ మూవీలో ద్విపాత్రాభినయం చేస్తుండగా.. అలనాటి అందాలతార శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీకపూర్ తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్నది. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తుండడంతో సినిమాపై భారీగానే అంచనాలున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు అభిమానులను అలరించాయి. సినిమా ఓపెనింగ్స్‌తో నుంచే కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని ఎన్టీఆర్ అభిమానులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. ఏపీలోని ఇటీవల దేవర సినిమా టికెట్ల ధరలను పెంచుకునేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు జీవో జారీ చేసింది. ఈ క్రమంలో ఏపీలో సోమవారం నుంచి టికెట్ల అడ్వాన్స్‌డ్ బుకింగ్ మొదలైంది.

# గిన్నిస్ బుక్‌లో చిరంజీవి

**బలగం టీవీ , హైదరాబాద్**

: మెగాస్టార్ చిరంజీవికి మరో అరుదైన గౌరవం దక్కింది. వరల్డ్ ఫేమస్ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డు దక్కింది. సినీరంగంలో 150కిపైగా చిత్రాల్లో నటించిన చిరంజీవికి విభిన్న ఆహార్యం, నటన, డ్యాన్స్‌కుగాను గిన్నిస్‌బుక్‌లో చోటు లభించింది. గిన్నిస్ బుక్ రికార్డ్స్ ప్రతినిధి రిచర్డ్ చిరంజీవికి అవార్డు అందించారు. ఈ కార్యక్రమంలో బాలీవుడ్ స్టార్ నటుడు ఆమిర్ ఖాన్ చీఫ్ గెస్ట్‌గా హాజరయ్యారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం ఈ ఈవెంట్ జరిగింది. కాగా, మోస్ట్ ప్రొలిఫిక్ ఫిల్మ్ స్టార్ ఇన్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ యాక్టర్, డాన్సర్‌గా చిరంజీవి ఎంపికయ్యారు. 156 సినిమాల్లో 537 పాటలు, 24 వేల డ్యాన్స్ మూమెంట్స్‌కు చిరంజీవికి ఈ అవార్డు దక్కింది. ఇక కార్యక్రమంలో చిరంజీవి కుటుంబ సభ్యులు, ఆయన కుమార్తె సుష్మిత, మెగా హీరోలు వరుణ్ తేజ్, సాయి ధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్ పాల్గొన్నారు. టాలీవుడ్ ప్రముఖ నిర్మాతలు అశ్వినీ దత్, అల్లు అరవింద్, సురేశ్ బాబు, సీనియర్ డైరెక్టర్ రాఘవేంద్రరావు, డైరెక్టర్ బాబీ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ గిన్నిస్ రికార్డ్స్‌లో చోటు ఎప్పుడూ ఊహించలేదని అన్నారు. ఇది తనకు ఎంతో గౌరవం అని తెలిపారు. ఎప్పుడూ ఊహించని గౌరవం నాకు ఇవాళ దక్కిందన్నారు. దీనికి కారకులైన నా దర్శక, నిర్మాతలు, సంగీత దర్శకులు, కొరియోగ్రాఫర్లు అభిమానులకు ధన్యవాదాలు. డ్యాన్స్‌పై ఉన్న ఆసక్తే నాకు ఈ అవార్డు అందించిందా అనిపిస్తోంది. నటనకంటే ముందే నేను డ్యాన్స్‌కు శ్రీకారం చుట్టాను. చిన్నప్పుడు రేడియోలో వచ్చే పాటలకు డ్యాన్స్ చేసి అందరిని అలరించేవాడిని' అని చిరు అన్నారు.



## మిస్ యూనివర్స్ ఇండియాగా రియా సింఘా

**బలగం టీవీ , హైదరాబాద్**



ఈ ఏడాది మిస్ యూనివర్స్ ఇండియా క్రౌన్‌ను గుజరాత్‌కు చెందిన రియా సింఘా అందుకున్నారు. 18 ఏళ్ల వయసులోనే ఈ అందాల పోటీల్లో గెలిచి అందరినీ ఆకర్షించారు. సుమారు 51 మంది ఫైనలిస్టులతో పోటీ పడుతూ ఆమె ఈ కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. 2015లో మిస్ యూనివర్స్ ఇండియా కిరీటాన్ని అందుకున్న బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతేలా ఈ పోటీలకు జడ్జీగా వ్యవహరించారు.

రియా మాట్లాడుతూ "ఈ రోజు నేను టైటిల్ గెలుచుకున్న మూమెంట్‌ను నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. ఈ కాంపిటిషన్‌లో పాల్గొనడం కోసం నేను ఎంతో కష్టపడ్డాను. ఈ పొజిషన్‌కు చేరుకోవడం వెనక ఎంతో కృషి ఉంది. గతంలో ఈ పోటీల్లో గెలిచిన వారిని నేను ఇన్‌స్పిరేషన్?గా తీసుకున్నాను" అని అన్నారు.




## సత్యం సుందరం ట్రైలర్ విడుదల

**బలగం టీవీ , హైదరాబాద్**

కోలీవుడ్ స్టార్ యాక్టర్లు కార్తీ, అరవింద్ స్వామి లీడ్ రోల్స్‌లో నటిస్తోన్న తమిళ చిత్రం మెయ్యళగన్. 96 ఫేం ప్రేమ్ కుమార్ సీ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ తెలుగులో 'సత్యం సుందరం' పేరుతో విడుదల కానుంది. సెప్టెంబర్ 28న తెలుగు రాష్ట్రాల్లో విడుదలవుతోంది. ప్రమోషన్స్‌లో భాగంగా ట్రైలర్ లాంచ్ చేశారు. కార్తీ, అరవింద్‌స్వామి మధ్య అనుబంధం నేపథ్యంలో భావోద్వేగపూరిత సన్నివేశాలతో సినిమా ఉండబోతున్నట్టు ట్రైలర్‌తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఇద్దరి స్నేహితుల కథతో ఫన్ ఎలిమెంట్స్‌తో సరదా సన్నివేశాలతో సీరియస్ ఎలిమెంట్స్‌తో సినిమా సాగనున్నట్టు ట్రైలర్ చెప్పకనే చెబు

# నారాయణపూర్‌లో ఎన్‌కౌంటర్..

- **ముగ్గురు మావోల హతం**

**బలగం టీవీ, ఛత్తీస్‌గఢ్**

ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లాలో సోమవారం భద్రతా సిబ్బంది, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మహిళా మావోయిస్ట్ సహా ముగ్గురు హతమయ్యారని సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర అంతర్రాష్ట్ర సరిహద్దులోని అబుజ్‌మడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కోసం బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో సాయంత్రం 4 గంటల సమయంలో ఎదురు కాల్పులు జరిగాయి.



సంఘటనా స్థలం నుంచి ఏకే 47 రైఫిల్‌తో పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారని.. ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని పోలీస్ అధికారి పేర్కొన్నారు. తాజా ఎన్‌కౌంటర్‌తో ఈ ఏడాది ఇప్పటి వరకు ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతంలో వేర్వేరు ఘటనల్లో 157 మంది మావోయిస్టులు హతమయ్యారని పోలీసులు వివరించారు.

# పిల్లల పోర్న్ వీడియోలు చూడడం నేరమే

- **సుప్రీం కోర్ట్**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

పిల్లల బూతు సినిమాలు చూడ్డం, అలాంటి వీడియోలను డౌన్ లోడ్ చేసుకోవడం నేరమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పిల్లల బూతు సినిమాలు చూడ్డం పోక్సో చట్టం కింద నేరం కాదని మద్రాసు హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ పై సుప్రీం కోర్టు ఈ తాజా స్పష్టీకరణ ఇచ్చింది. అంతేకాక మద్రాసు హైకోర్టు తీర్పును పక్కనపెట్టింది. కాగా మద్రాసు హైకోర్టు అలాంటి తీర్పునిచ్చి తప్పిదం చేసిందని ప్రధాన న్యాయమూర్తి డివై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలను డౌన్లోడ్ చేసుకున్న 28 ఏళ్ల యువకుడి పై మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ అనేక ఎన్జీవోలు, చిన్నారుల సంక్షేమ సంఘాలు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాయి. దాంతో సుప్రీంకోర్టు మద్రాస్ హైకోర్టు తీర్పును తోసిపుచ్చింది. సదరు యువకుడిపై క్రిమినల్ చర్యలను పునరుద్ధరించాలని పేర్కొంది.



# పాడి రైతుల బకాయిలకు రూ.50 కోట్లు విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

విజయ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న పాడి రైతుల పెండింగ్ బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసింది. మంగళవారం పాడి రైతులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లిస్తామని విజయ డెయిరీ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. పాల బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి బాధలను అర్థం చేసుకున్న ప్రభుత్వం బిల్లులు చెల్లించేందుకు నిధులు మంజూరు చేసిందన్నారు.బిల్లుల విషయంలో ఆందోళన చెందవద్దని పాడి రైతులు విజ్ఞప్తి చేశారు. మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరకు విజయ డెయిరీ పాలను కొనుగోలు చేస్తోందని, బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని




రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. రూ.50 కోట్ల చెల్లింపు పూర్తి చేసి.. మిగిలిన బకాయిలను వీలైనంత త్వరగా చెల్లిస్తానని హామీ ఇచ్చారు.

**రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు విజయ డెయిరీ నెయ్యి : గుత్తా అమిత్‌రెడ్డి**

రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు విజయ డెయిరీ నెయ్యినే సరఫరా చేస్తామని తెలంగాణ డెయిరీ డెలవప్‌మెంట్ సొసైటీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాల సేకరణ రేటును మూడు సార్లు రూ.12.48 రూపాయలు పెంచారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాల సేకరణ రేటు పెంచడంతో పాల సేకరణ గణనీయంగా పెరిగిందన్నారు. ఇక నుంచి విజయ డెయిరీ పాల అమ్మకాలు మరింత పెంచడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు, సంక్షేమ హాస్టళ్లకు, పాఠశాలలకు, జైళ్ల, హాస్పిటల్స్‌కు అవసరమైన పాలు, పాల పదార్థాలు సరఫరా చేస్తామని పేర్కొన్నారు. అలాగే పెండింగ్ పాల బిల్లులను కూడా త్వరలోనే చెల్లిస్తామని ఆయన చెప్పారు.

# పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు



**బలగం టీవీ, హైదరాబాద్**

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ 'ప్రజాశాంతి పార్టీ' అధ్యక్షుడు కెఏ.పాల్ దాఖలు చేసిన పిటిషన్ ను విచారించిన హైకోర్టు, పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది.ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి మారడం రాజ్యాంగ విరుద్ధం అని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కెఏ.పాల్ తన పిటిషన్ లో కోరారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బిఆర్ఎస్ టికెట్ పై గెలుపొంది, ఆరునెలలు గడవక ముందే మరో పార్టీలోకి జంప్ చేశారని ఆయన తన పిటిషన్ లో పేర్కొన్నారు. రాజీనామా చేయకుండ వేరే పార్టీలో చేరడం తప్పని, అది చట్టాన్ని, రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే కాగలదని వాదించారు. కెఏ. పాల్ పిటిషన్ పై వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం 10 మంది బీఆర్ఎస్ ఎంఎల్ఏ లకు నోటీసులు జారీ చేసింది. ఇదివరలో స్పీకర్ కూడా తాకీదులు కూడా జారీ చేసింది. నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోకుంటే సుమోటోగా కేసును విచారిస్తామని అసెంబ్లీ స్పీకర్ కు స్పష్టం చేసింది. ఇప్పుడు కెఏ.పాల్ పిటిషన్ పై కూడా హైకోర్టు స్పందించింది.

# తెలంగాణను బీహార్ లా మారుస్తున్నారు



- **కాంగ్రెస్ గుండాలను అరెస్టు చేయాలి**
- **హరీశ్ రావు**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణకున్న మంచి పేరును మంటగలిపి బీహార్ లా మారుస్తున్నారని, రాష్ట్రంలో గుండా రాజ్యం నడుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఎమ్మెల్యే సునీతా రెడ్డి అనుచరులపై ఆదివారం రాత్రి దాడి జరిగిన విషయంపై ఆయన తీవ్రంగా స్పందించారు. గోమారంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెచ్చగొట్టే మాటలు ప్రతిపక్షాల మీద కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ గూండాలను వెంటనే అరెస్టు చేయాలన్నారు. రేవంత్ రెడ్డి పోలీసులను కూడా చెడగొడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి శాశ్వతం కదన్న సంగతి పోలీసులు గుర్తుపెట్టుకోవాలన్నారు. గోమారంలో దాడి చేసిన గుండాలను అరెస్టు చేయాలని అన్నారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయకపోతే డిజిపి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, చింత ప్రభాకర్, మాజీ ఎంఎల్ఏ క్రాంతి కిరణ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి, ఎర్రోళ్ల శ్రీనివాస్, నహీం, దొంతి సంతోష్ రెడ్డి, సత్యం గౌడ్, శేఖర్, మన్సూర్ వెంకట్ రెడ్డి, మాజీ ఎంపిపిలు హరికృష్ణ, నర్సింహులు, బిఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# గాంధీ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత..

- **బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అరెస్ట్**

**బలగం టీవీ, హైదరాబాద్**

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. దవాఖానలో పరిస్థితులను అధ్యయనం చేయడానికి వెళ్లిన బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకున్నది. మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్యతోపాటు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, మాగంటి గోపీనాథ్‌ను అదుపులోకి తీసుకుని అక్కడినుంచి తరలించారు.

గాంధీ సహా రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల అధ్వాన పరిస్థితిని అధ్యయనం చేసేందుకు రాజయ్య నేతృత్వంలో బీఆర్ఎస్ నిజ నిర్ధారణ కమిటీని నియమించిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి నిపుణులైన డాక్టర్లతో కూడిన త్రిసభ్య కమిటీ క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించింది. ఇందులో భాగంగా గాంధీ దవాఖానను పరిశీలించాల్సి ఉన్నది. అయితే కమిటీ పర్యటనను కాంగ్రెస్ సర్కార్ అడ్డుకున్నది. రాజయ్య సహా కమిటీ సభ్యులైన మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎమ్మెల్యే సంజయ్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అనేక నిర్బంధాల నడుమ గాంధీ దవాఖానకు చేరుకున్న కమిటీ సభ్యులతోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో



నుంచి బయటకు రాకుండా భారీగా పోలీసులు మోహరించారు.

**ఆసుపత్రులను పరిశీలించేందుకు వెళ్తే అరెస్టులా..? : కేటీఆర్**

ఆసుపత్రులను పరిశీలించేందుకు వెళ్తే అరెస్టులా..? ఎందుకింత భయం నీకు రేవంత్..? అని కేటీఆర్ అన్నారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడంలో ప్రయత్నం చేసిన పార్టీ ఎమ్మెల్యేలను, సీనియర్ నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులలోకి వెళ్లకుండా అడ్డంకులు కల్పించ వద్దని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమం కోసమే, స్వయంగా డాక్టర్లు అయిన మా నాయకులు ఆసుపత్రులను పరిశీలిస్తారని కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడినా, ప్రజారోగ్య వ్యవస్థలో లోపాలను ఎత్తి చూపుతామని కేటీఆర్ తేల్చిచెప్పారు.



# తొలి టెస్టులో భారత్ భారీ విజయం



- 280 పరుగులతో విజయం
- సిరీస్‌లో 1-0తో ముందంజలోకి

**బలగం టీవీ, చెన్నై**

బంగ్లాపై టీమిండియా భారీ విజయం సాధించింది. చెన్నై వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో రోహిత్ సేన 280 పరుగులతో విజయం సాధించింది. 515 పరుగుల ఛేదనలో బంగ్లా 234 పరుగులకే పోరాటాన్ని చాలించింది. దాంతో రెండు టెస్టుల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యం సాధించింది.

తొలి ఇన్నింగ్స్‌లో బ్యాట్‌తో సెంచరీ చేసిన రవిచంద్రన్ అశ్విన్.. రెండో ఇన్నింగ్స్‌లో బంతి (6/88)తో ఆరు వికెట్లు పడగొట్టాడు. అశ్విన్‌కు తోడు అతడి సహచర స్పిన్నర్ రవీంద్ర జడేజా (3/58) రాణించడంతో 515 పరుగుల ఛేదనలో పర్యాటక జట్టు 234 పరుగులకే ఆలౌట్ అయ్యింది. భారీ ఛేదనలో బంగ్లా జట్టు సారథి నజ్ముల్ హొసేన్ శాంతో (82) పోరాడినా అతడికి అండగా నిలిచేవారు కరువవడంతో బంగ్లాకు ఓటమి తప్పలేదు. మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షో తో అదరగొట్టిన రవిచంద్రన్ అశ్విన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ సిరీస్‌లో రెండో టెస్టు ఈనెల 27 నుంచి కాన్పూర్ వేదికగా జరుగనుంది.

ఓవర్ నైట్ స్కోరు 158/4 వద్ద నాలుగో రోజు ఆటను ఆరంభించిన బంగ్లా కనీస పోరాటం లేకుండానే రెండు గంటల్లోపే ఇన్నింగ్స్ ముగించింది.

తొలి గంటలో శాంతో, షకిబ్ (25) కొద్దిసేపు వికెట్లను కాపాడుకునే దశలో మరీ నెమ్మదిగా ఆడారు. కానీ డ్రింక్స్ తర్వాత కెప్టెన్ రోహిత్.. బంతిని అశ్విన్‌కు అందించడంతో బంగ్లా 'ఖేల్' ఖతం అయింది. అశ్విన్, జడ్డూ కలిసి 10 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు. అశ్విన్ తన తొలి ఓవర్‌లోనే షకిబ్‌ను పెవిలియన్‌కు పంపాడు. స్లిప్స్‌లో యశస్వీ అద్భుత డైవ్ క్యాచ్ పట్టడంతో 48 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఇక ఆ తర్వాత వచ్చినోళ్లెవరూ రెండంకెల స్కోరు కూడా చేయలేకపోయారు. జడేజా బౌలింగ్‌లో లిటన్ దాస్ (1) రోహిత్‌కు క్యాచ్ ఇవ్వగా బంగ్లా భారీ ఆశలు పెట్టుకున్న మెహిది హసన్ మిరాజ్ (8)ను అశ్విన్ ఔట్ చేసి రెండో ఇన్నింగ్స్‌లో 'ఫైఫర్'ను పూర్తిచేసుకున్నాడు. జడేజా వేసిన ఓవర్లో హసన్ మహ్మూద్ (7) క్లీన్ బౌల్డ్ అవడంతో బంగ్లా ఇన్నింగ్స్‌కు తెరపడింది.

**సంక్షిప్త స్కోరు**

భారత్: తొలి ఇన్నింగ్స్ 376 ఆలౌట్,
బంగ్లాదేశ్: తొలి ఇన్నింగ్స్ 149 ఆలౌట్,
భారత్: రెండో ఇన్నింగ్స్ 287/4 డిక్లేర్డ్.
బంగ్లాదేశ్: రెండో ఇన్నింగ్స్ 234 ఆలౌట్

## రెండో టెస్టుకు భారత జట్టు ఇదే..

**బలగం టీవీ, చెన్నై**

బంగ్లాదేశ్‌తో కాన్పూర్ వేదికగా జరిగే రెండో టెస్టుకు భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది., తొలి టెస్టుకు ఎంపిక చేసిన జట్టు సభ్యులనే రెండో టెస్టులోనూ కొనసాగిస్తున్నట్టు బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

**భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ బుమ్రా, యశ్ దయాల్**

# న్యూజిలాండ్‌పై శ్రీలంక విజయం



**బలగం టీవీ, గాలె**

తొలి టెస్టులో న్యూజిలాండ్‌పై శ్రీలంక విజయం సాధించింది. లంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య రెండో ఇన్నింగ్స్‌లో కీలకమైన అయిదు వికెట్లు తీయడంతో 63 పరుగుల తేడాతో శ్రీలంక గెలుపొందింది.

275 రన్స్ టార్గెట్‌తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కివీస్.. కేవలం 211 రన్స్‌కు ఆలౌటైంది. అయిదో రోజు ఆట ఆరంభమైన 15 నిమిషాల్లోనే చివరి రెండు వికెట్లను న్యూజిలాండ్ కోల్పోయింది. రచిన్ రవీంద్ర ఒంటరి పోరాటం చేసి 92 రన్స్ చేశాడు. ఇక ఇదే పిచ్‌పై గురువారం రెండో టెస్టు ప్రారంభంకానున్నది.

# దులీప్ ట్రోఫీ ఛాంపియన్ ఇండియా ఏ





**బలగం టీవీ, అనంతపురం**

2024 దులీప్ ట్రోఫీ టోర్నమెంట్‌లో ఛాంపియన్‌గా ఇండియా ఏ నిలిచింది. ఇండియా ఏ తో జరిగిన మ్యాచ్‌లో 132 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో పాయింట్ల పట్టికలో 9 పాయింట్లతో అగ్రస్థానంలోకి భారత్ దూసుకొచ్చి టైటిల్‌ను సొంతం చేసుకుంది. 350 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా-సి 217 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 297 పరుగులు చేసిన ఇండియా - ఏ రెండో ఇన్నింగ్స్‌లో 286 పరుగులకు 8 వికెట్లు కోల్పోయి డిక్లేర్ చేసింది.

# మార్చి 28న 'హరిహర వీరమల్లు'




**బలగం టీవీ, హైదరాబాద్**

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'హరిహర వీరమల్లు' సినిమా రిలీజ్ డేట్ ఫిక్స్ అయ్యింది. క్రిష్ దర్శకత్వంలో చాలావరకూ చిత్రీకరణ జరుపుకున్న ఈ సినిమా, కొన్ని కారణాల వలన చాలా కాలం క్రితమే ఆగిపోయింది. మధ్యమధ్యలో చిన్న చిన్న షెడ్యూల్స్ నే ప్లాన్ చేయడం వలన, ఆశించిన స్థాయిలో ప్రాజెక్టు ముందుకు వెళ్లలేదు. అలాంటి ఈ ప్రాజెక్టులో మళ్లీ ఇప్పుడు కదలిక మొదలైంది. సోమవారం మొదలైన తాజా షెడ్యూల్లో పవన్ పాల్గొన్నారు. ఎ.ఎం.రత్నం నిర్మిస్తున్న ఈ సినిమాకి, మొదట్లో క్రిష్ దర్శకత్వం వహించాడు. అయితే ఈ రోజు నుంచి మొదలవుతున్న షెడ్యూల్ నుంచి ఎ.ఎం.రత్నం తనయుడు జ్యోతికృష్ణ దర్శకత్వం వహించనున్నాడు. ఈ నేపథ్యంలో ఈ సినిమా రిలీజ్ డేట్ ను కూడా ఖరారు చేస్తూ, అందుకు సంబంధించిన పోస్టర్ ను మేకర్స్ విడుదల చేశారు. వచ్చే ఏడాది మార్చి 28వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయనున్నారు.ఈ సినిమాలో పవన్ నిధి అగర్వాల్ అలరించనుంది. అర్జున్ రామ్ పాల్ .. జాక్విలిన్ ఫెర్నాండెజ్ .. ఆదిత్య మీనన్ ముఖ్యమైన పాత్రలలో కనిపించనున్నారు. కీరవాణి సంగీతం ఈ సినిమాకి హైలైట్ గా నిలవనుంది.

## ఆస్కార్‌కు 'లాపతా లేడీస్'

**బలగం టీవీ, హైదరాబాద్**




ఆమిర్ ఖాన్ నిర్మాణంలో, ఆయన మాజీ భార్య కిరణ్ రావు దర్శకత్వం వహించిన మూవీ 'లాపతా లేడీస్'. ఈ సినిమా ఇండియా నుంచి 2025 ఆస్కార్‌కు ఎంపికైంది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా. రెండు రోజుల క్రితం ఓ ఇంటర్వ్యూలో కిరణ్ రావు మాట్లాడుతూ... తమ చిత్రం ఆస్కార్ వేదికపై మన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తుందని జోస్యం చెప్పారు. తమ సినిమా ఆస్కార్ కు వెళ్లాలనేది తనతో పాటు చిత్ర యూనిట్ కోరిక అని కూడా తెలిపారు. ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కూడా తనవంతు బాధ్యతగా ఈ సినిమాను తప్పకుండా ఆస్కార్‌కు పంపిస్తుందనే నమ్మకం తనకు ఉందని చెప్పుకొచ్చారు. ఆమె అన్నట్టుగానే మూవీ ఆస్కార్‌కు ఎంపిక అయింది.

ఇక మార్చి 1న విడుదలైన 'లాపతా లేడీస్' బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక అవార్డ్సను సొంతం చేసుకుంది. అలాగే సుప్రీంకోర్టు ఆవిర్భవించి 75 ఏళ్లు అయిన సందర్భంగా కూడా కోర్టు అడ్మినిస్ట్రేట్ వేడుకల్లోనూ ఈ మూవీని ప్రదర్శించడం జరిగింది.

## ప్రీ రిలీజ్ రద్దు బాధాకరం : ఎన్టీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎన్టీఆర్ నటించిన 'దేవర పార్ట్ 1' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆదివారం రద్దయిన సంగతి తెలిసిందే. దీనిపై హీరో ఎన్టీఆర్ స్పందించారు.

'నమస్కారం. ఈరోజు దేవర ప్రీ రిలీజ్ ఈవెంట్ క్యాన్సిల్ అవ్వడం బాధాకరం. ముఖ్యంగా నాకు ఎక్కువ బాధగా ఉంది. అవకాశం దొరికినప్పుడల్లా మీతో సమయం గడపాలని ఉంటుంది. దేవర సినిమా గురించి, ఈ చిత్రం కోసం పడ్డ కష్టం గురించి అందరికీ వివరిద్దామని అనుకున్నా. కానీ, భద్రతా కారణాల వల్ల ఈవెంట్ క్యాన్సిల్ అయ్యింది. మేకర్స్, ఈవెంట్ ఆర్గనైజర్స్ వైఫల్యం వల్లే ఇలా జరిగిందనడం తప్పు. మీ ప్రేమకు రుణపడి ఉంటా. ఇవాళ కలవడం కుదరకపోయినా, 27న మనమందరం కలుస్తున్నాం. దేవర చిత్రాన్ని అందరూ చూడబో తున్నారు. మీరు కాలర్ ఎగరేసుకునేలా ఈ సినిమా ఉంటుంది. సినిమా కోసం శివ చాలా కష్టపడ్డారు. మీ ప్రేమ, ఆశీర్వాదం ఉండాలి. అందరూ జాగ్రత్తగా వెళ్లారని ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు.